సాక్షి ఆదిలాబాద్

మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025

ఆల్‌రౌండర్.. శశివంత్



చెన్నూర్‌కు చెందిన చల్లా శశివంత్‌రెడ్డి క్రికెట్‌లో రాణిస్తు న్నాడు. కోలిండియా పోటీలకు ఎంపిక య్యాడు. ప్రస్తుతం కోల్‌కత్తా క్యాం ప్‌లో ప్రాక్టీస్ చేస్తున్నాడు. 8లో▸



నిషేధిత విత్తనంపై జాగ్రత్త

నిషేధిత గ్లైసిల్ పత్తి విత్తనాల దందాకు సమయం ఆసన్నమైంది. ఈ సీజన్‌లోనే అక్ర మార్కులు ఇతర ప్రాంతాల నుంచి నకిలీ విత్తనాలు దిగుమతి చేసుకుంటారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

బీసీలకే మద్దతివ్వాలి

- జీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

ఆదిలాబాద్‌రూరల్: ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకే పట్టభద్రులు, ఉపాధ్యా యులు మద్దతివ్వాలని బీసీ సంక్షేమ సం ఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌ డ్ అన్నారు. ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులకు మద్దతు తెలుపుతూ ఆయ న సోమవారం జిల్లాకు విచ్చేశారు. ఈ సం దర్భంగా మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల తరఫున గతంలో ఏ సీఎం ప్రచారం చేప ట్టలేదన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి మా త్రం ఆయా ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నా రన్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమి చెందినా తమ పార్టీకి ఒరిగేదేమీ లేదంటూ సీఎం పేర్కొనడం ఎన్నికల ముం దే ఓటమిని అంగీకరించడమే అవుతుందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ఎమ్మెల్సీ టికెట్లను బీసీలకు కాకుం డా రెడ్డి సామాజిక వర్గానికే కేటాయించాయ న్నారు. ఈ క్రమంలో పలువురు బీసీ అభ్య ర్థులు ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచార న్నారు. వారిని ఆదరించాలని కోరారు. ఈ నెల 27న నిర్వహించనున్న ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. సమావేశంలో సంఘం యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తు, శ్రీని వాస్, ఉపాధ్యక్షుడు అశోక్, గౌరవ అధ్య క్షుడు నర్సాగౌడ్ తదితరులున్నారు.

పోల్‌చీటీలు అందజేత



పోల్ చీటీ అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

కైలాస్‌నగర్: ఈనెల 27న నిర్వహించనున్న ఎమ్మెల్సీఎన్నికలకు సంబంధించిన ఓటర్లకు ఎన్నికల సంఘం అధికారికంగా పోల్ చీటీ లు అందజేస్తోంది. జిల్లాలో పట్టభద్రుల ఓ టర్లు 14,935మంది ఉండగా టీచర్స్ ఓట ర్లు 1593 మంది ఉన్నారు. ఓటరు సీరియల్ నంబర్, పేరు, తండ్రి పేరు, చిరునామా, పోలింగ్ కేంద్రం, లొకేషన్ మ్యాప్, పోలిం గ్ తేది, సమయం వంటి వివరాలతో ము ద్రించిన చీటీలను ఓటర్లకు రెవెన్యూ సిబ్బం ది ద్వారా అందజేస్తున్నారు. రెండు రోజు లుగా జిల్లాలోని అన్ని కేంద్రాల పరిధిలో ఈ ప్రక్రియ సాగుతోంది. మంగళవారంలోగా పంపిణీ పూర్తి చేయాలని అధికారులు నిర్ణ యించారు. అయితే ఈనెల 26 వరకు పం పిణీ జరిగే అవకాశం ఉన్నట్లుగా సిబ్బంది చెబుతున్నారు.

పొదుపుతో ఆర్థికాభివృద్ధి

కైలాస్‌నగర్: మహిళలు పొదుపు ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఈ నెల 24 నుంచి 28 వరకు ఆర్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆర్థి క అక్షరాస్యత వారోత్సవాల ప్రచార పోస్ట ర్‌ను కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమ వారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనే జర్ ఉత్పల్ కుమార్, పరిశ్రమల శాఖ జన రల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు, టీజీబీ రీజినల్ మేనేజర్ ప్రభుదాస్, ఎస్‌బీఐ ఎఫ్ఐ మేనేజర్ విజయ్, విడ్స్ క్లస్టర్ కోఆర్డినేటర్ గంగాధర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంకల్ప సభ



సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి



సభకు హాజరైన పట్టభద్రులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

- నస్పూర్‌లోని మైదానంలో ఏర్పాటు
- వేలాదిగా తరలివచ్చిన పట్టభద్రులు, కాంగ్రెస్ శ్రేణులు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి హామీ

నస్పూర్: మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–క రీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న మైదానం లో సోమవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సంక ల్పసభ ఉత్సాహంగా సాగింది. ఉమ్మడి జిల్లా నుం చి వేలాదిగా పట్టభద్రులు హాజరు కావడంతో కాం గ్రెస్ పార్టీ శ్రేణుల్లో జోష్ కనిపించింది. మంచిర్యాల



హెలిప్యాడ్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు ప్రేంసాగర్‌రావు, వినోద్

డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లా డారు. ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల్లోని సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు మాట్లా డుతూ సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ప్పుడు ఇంద్రవెల్లిలో భారీ బహిరంగ సభ నిర్వహిం చి ఎన్నికల శంఖారావం పూరించారని తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రజలు ఎల్లప్పుడూ కాంగ్రెస్ వెన్నం టే ఉన్నారని అన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని సీఎం ప్రకటించడంతో ప్రజలు, కాంగ్రెస్ శ్రేణుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. ఈ సభలో మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కంటోన్మెంట్, భూపాలపల్లి ఎమ్మెల్యేలు శ్రీగణేశ్, గండ్ర సత్యనారాయణరావు, రాష్ట్ర కనీస వేతన సవరణ బోర్డు చైర్మన్ జనక్‌ప్ర సాద్, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చా ర్జీలు శ్యాంనాయక్, ఆడె గజేందర్, కంది శ్రీనివాస్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రవళి, ఆదిలాబాద్ పార్ల మెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, జిల్లా, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

సురేఖమ్మ 24గంటలు పని చేస్తున్నరు: సీఎం

'మంచిర్యాల ప్రజలు అదృష్టవంతులు. మీరు ఒక్క ఓటు వేసి ఎమ్మెల్యేను ఎన్నుకుం టే మీకు ఇద్దరు సేవకులు వచ్చారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు రోజుకు 16గం టలు పని చేస్తే, డీసీసీ అధ్యక్షురాలిగా సురే ఖమ్మ 24గంటలు పని చేస్తున్నారు' అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు.

మాస్టర్‌ప్లాన్‌కు నిధులివ్వండి..

– మంచిర్యాల ఎమ్మెల్యే కే.ప్రేంసాగర్‌రావు



మంచిర్యాల లో మాస్టర్ ప్లాన్ అమ లుకు అనుగు ణంగా పను లు మొద లుపెట్టామని, అందుకు రూ.78కోట్లు, గూడెం సత్య నారాయణస్వామి ఆలయ అభివృద్ధికి రూ.12కోట్లు కేటాయించాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. మంచిర్యాలను కార్పొ రేషన్‌గా మార్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోఎక్కడా లేని విధంగా మంచిర్యాలలో నాలుగు ఎకరాల్లో రూ.11 కోట్లతో గ్రీన్‌క్రిమిటోరియం పద్ధతిలో శ్మశాన వాటిక నిర్మిస్తున్నామని, దీనిలో పూర్తిగా సోలార్ పవర్ వాడే విధంగా చర్యలు తీసుకు న్నామని, పూర్తి కావొచ్చిందని తెలిపారు. కర కట్ట నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తా మని, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మాతాశిశు కేంద్రం ఆసుపత్రి నిర్మాణ పను లు కొనసాగుతున్నాయని వివరించారు. సిం గరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్న వారికి పట్టాలు ఇప్పించాలని, సింగరేణి రిటైర్డ్ కార్మికులకు తెల్లరేషన్ కార్డులు మం జూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం రేవం త్‌రెడ్డి తన ప్రసంగంలో మంచిర్యాల నియో జకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తానని, ఎమ్మెల్యే తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో సభలో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి.

దళితుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

– చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి

జిల్లాలో వెనుకబడిన వర్గాల ప్రజలు అధికం గా ఉన్నారని వారిని ఆదుకునే విధంగా నేత కానీ, మాలలకు ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి కోరారు. కార్పొరేషన్లకు నిధులు కేటాయించి వారి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని తెలిపారు.

ఇంజనీరింగ్ కాలేజీ మంజూరు చేయాలి

– బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లికి ఇంజనీరింగ్ కాలేజీ మంజూరు చేయాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ కోరారు. సీఎం సహకారంతో బుగ్గ గుట్ట ఆలయానికి రోడ్డు నిర్మించానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఓటర్లు ఈ ఎన్నికలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధికి కట్టు బడిన కాంగ్రెస్‌ను ఆదరించాలని అన్నారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి



– ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి వూటుకూరి

తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేం దర్‌రెడ్డి వూటుకూరి అన్నారు. ఎన్నికల్లో ఓటరు నమోదు చేసుకున్న వారందరికీ ఉచితంగా రూ.3 లక్షల ప్రమాద బీమా కల్పిస్తానని హామీ ఇచ్చారు. సింగరేణి సంస్థలో పని చేస్తున్న గ్రాడ్యుయేట్లకు ప్రమోషన్లు ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలో పని చేస్తున్న టీచర్లకు కనీస వేతనం ఇప్పించేందుకు ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌కు యూనివ ర్సిటీ తీసుకువచ్చే విధంగా ప్రభుత్వంతో చర్చిస్తానని తెలిపారు. ప్రభుత్వానికి పట్టభద్రులకు మధ్య వారధిగా ఉండి వారి సమస్యలన్నీ పరిష్కరించడానికి ఎల్లవేళలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పని చేసే ప్రభుత్వం

– ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

కేంద్రం నుంచి ఎటువంటి సాయం లేకున్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్యాస్ సబ్సిడీ, రుణమాఫీ, పింఛన్లు, ఉచిత విద్యుత్ ఇస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. జీతాలు పెంచడానికి కూడా మద్దతు ఇవ్వడం లేదని తెలిపారు. బీఆర్ ఎస్ మాటలతో మోసం చేసిందని, పని చేసే ప్రభుత్వానికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకు నేది కాంగ్రెస్ ప్రభుత్వమని, నాలుగేళ్లలో అన్ని హామీలు అమ లు చేస్తామని, ఉమ్మడి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించ డానికి పట్టభద్రులు కాంగ్రెస్‌కు ఓటెయ్యాలని కోరారు.

ఆదర్శప్రాయుడు సేవాలాల్



సేవాలాల్ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

- కలెక్టర్ రాజర్షి షా
- ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి

ఆదిలాబాద్‌రూరల్: సంత్ సేవాలాల్ మహరాజ్ జీవిత చరిత్ర ఆదర్శణీయమని కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. సేవాలాల్ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో సోమవారం అధికారికంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సేవాలాల్ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా లంబాడా సంప్ర దాయం ప్రకారం బోగ్ బండార్ నిర్వహించారు. అనంతరం మహిళలు, యువతులతో కలిసి సంప్ర దాయ నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సేవాలాల్ చూపిన మార్గం అనుసరణీయమన్నారు. ఎంపీ గోడం నగేశ్ మాట్లా డుతూ, సేవాలాల్ యావత్ జాతికి మార్గదర్శకమ న్నారు. అంతకు ముందు ఎమ్మెల్యేలు పాయల్ శం



హాజరైన బంజారా కులస్తులు

కర్, అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న, జెడ్పీ మాజీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఆలిండియా బంజారా సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు అమర్ సింగ్ తిలావత్ సేవాలాల్ చిత్రపటం వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్య క్షుడు బ్రహ్మానందం, బంజారా నాయకులు నరేశ్ జాదవ్, జాన్సన్ నాయక్, భరత్ చౌహాన్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాథోడ్ బాపూరావ్, గౌరవ అధ్య క్షుడు సురేశ్ రాథోడ్, గజానన్ నాయక్, హీరాలాల్ నాయక్, పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

- మార్చి 5 నుంచి 25 వరకు..
- జిల్లా వ్యాప్తంగా 31 కేంద్రాలు
- హాజరుకానున్న 18,880 మంది విద్యార్థులు
- ఓటీపీతో హాల్‌టికెట్ డౌన్‌లోడ్
- బార్‌కోడ్ స్కాన్ చేస్తే సెంటర్ వివరాలు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

జిల్లా వ్యాప్తంగా..
మొత్తం పరీక్ష కేంద్రాలు: 31
ప్రథమ సంవత్సరం విద్యార్థులు : 9,106
ద్వితీయ సంవత్సరం విద్యార్థులు : 9,774
స్క్వాడ్‌లు : 4(సిట్టింగ్ 2, ఫ్లయింగ్ 2)

హెల్ప్ డెస్క్ నంబర్లు:
08732-297115, 9848781808



ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 5 నుంచి 25 వరకు కొనసాగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించ నున్నారు. నిమిషం ఆలస్యం నిబంధన ఉండడంతో విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరు కోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సెంటర్లలో ఫర్నిచర్, తాగునీరు, వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొంటున్నారు. ఓటీపీ ద్వారా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని ఇంటర్ బోర్డు ఈ ఏడాది నుంచి అమలులోకి తీసు కొచ్చింది. ఇదివరకు ప్రైవేట్ కళాశాలల యాజమా న్యాలు ఫీజు చెల్లించలేదని విద్యార్థులకు హాల్‌టి కెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసేవి. ఇక నుంచి ఆ ఇక్కట్లు తొలగిపోనున్నాయి. బార్‌కోడ్ స్కాన్ చేస్తే పరీక్ష కేంద్రం వివరాలు తెలియను న్నాయి. విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే హెల్ప్‌డెస్క్ 08732- 297115, సెల్: 9848781808లలో సమాచారం అందించాలని డీఐఈవో రవీంద్రకుమార్ పేర్కొంటున్నారు.

31 కేంద్రాలు ఏర్పాటు..

ఇంటర్ పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 31 కేంద్రా లను ఏర్పాటు చేశారు. ఇందులో 13 ప్రభుత్వ జూ నియర్ కళాశాలలు, ఐదు సాంఘిక సంక్షేమ, రెండు ట్రైబల్ వెల్ఫేర్, తొమ్మిది ప్రైవేట్ జూనియర్ కళాశా లలు ఉన్నాయి. అలాగే ఒక మోడల్ స్కూల్, ఒక మైనార్టీ స్కూల్‌లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 18,880 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో ప్రథమ సంవ త్సరం జనరల్ విద్యార్థులు 8,093, ఒకేషనల్ 1,013 మంది, ద్వితీయ సంవవత్సరం జనరల్ విద్యార్థులు 8,754 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1020 మంది పరీక్షలు రాయనున్నారు.

పకడ్బందీ చర్యలు..

పరీక్షల నిర్వహణ కోసం అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా 31 మంది చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), 31 మం ది డిపార్ట్‌మెంటల్ (డీఓ) అధికారులు, ముగ్గురు క స్టోడియన్లు, రెండు సిట్టింగ్‌స్క్వాడ్ , రెండు ఫ్లయిం గ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. వీరితో పాటు హైపవర్ కమిటీని నియమించారు. ఈ కమిటీలో కలెక్టర్, ఎస్పీ, ఆర్‌జేడీ, డీఐఈవో, సీనియర్ ప్రిన్సిపాల్, సీనియర్ లెక్చరర్లు సభ్యులుగా ఉం టారు. అలాగే డీఈసీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో డీఐఈవో కన్వీనర్‌గా, ఇద్దరు సీనియర్ ప్రిన్సిపాళ్లు, ఒక జూనియర్ లెక్చరర్ సభ్యులుగా ఉంటారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా వీరు పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేపడుతారు.


వసతులపై ఫోకస్

పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించేందుకు ఈనెల 25న కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించను న్నారు. పలు శాఖల అధికారులతో ఈ సమావేశం ఉంటుంది. ప్రధానంగా విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లపై దృష్టి సారించనున్నారు. వైద్యారోగ్య శాఖ ద్వారా ప్రథమ చికిత్స కోసం సిబ్బందిని నియామకంతో పాటు గదుల్లో చీకటి ఉండకుండా లైట్లు, ఉక్కపోత సమస్య అధిగమించే లా ఫ్యాన్ల ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వెల్లడిం చారు. అలాగే కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచనున్నారు. పరీక్ష కేంద్రంలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయ నున్నారు. ప్రశ్న పత్రాలను తెరవడం, సీల్ వే యడం సీసీ కెమెరాల సమక్షంలోనే చేపట్టనున్నారు. అలాగే పరీక్ష కేంద్రం ఆవరణలో గేటు ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిని కంట్రోల్ కమాండ్ రూమ్‌కు అనుసంధానం చేయనున్నారు.

ఓటీపీ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్.

ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఫీజులు చెల్లించలేదని యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసే విధానానికి స్వస్తి పలికేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సెల్‌ఫోన్లకు ఓటీపీ పంపనున్నారు. దీని ద్వారా విద్యార్థులు హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరు కావచ్చు. కేంద్రాలు తెలియక కొంత మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతూ సమయానికి చేరుకోలేక పోతు న్నారు. ఈసారి హాల్‌టికెట్‌పై బార్‌కోడ్ ఏర్పాటు చేశారు. స్కాన్ చేస్తే పరీక్ష కేంద్రానికి సంబంధించిన వివరాలు తెలుసుకునే అవ కాశం ఉంది.

పకడ్బందీగా పరీక్షల నిర్వహణ..



ఇంటర్ పరీక్షలను పక డ్బందీగా నిర్వహిస్తాం. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో ఎగ్జామ్ రాయాలి. ఒత్తిడికి లోను కావొద్దు. మాస్‌కాపీయిం గ్‌పై ఆధారపడకూడదు. ఆయా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేపడుతు న్నాం. ఏవైనా ఇబ్బందులు ఉంటే హెల్ప్ డెస్క్‌కు సమాచారం అందించాలి.

– రవీంద్రకుమార్, డీఐఈవో

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలను పక డ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే పీవో, ఓపీ వోలకు జెడ్పీ సమావేశ మందిరంలో, అలాగే మైక్రో అబ్జర్వర్స్‌కు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం రెండో విడత శిక్షణ నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై మాస్టర్ ట్రైనర్లు రాజేశ్వర్, జగన్ పవర్‌పాయింట్ ప్రజంటే షన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవ గాహన కలిగి ఉండాలన్నారు. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ కొన సాగుతుందన్నారు. ప్రిసైడింగ్ అధికారులు ఈ నెల 26న ఉదయం 8గంటలకు తమ బృందంతో డిస్ట్రి బ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. పంపిణీ కేంద్రాల వద్ద అందించే సామగ్రి, బ్యాలెట్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

బాక్సులను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, చెక్ లిస్ట్‌లో పొందుపర్చబడిన మెటీరియల్ మొత్తం సరి చూసుకోవాలని సూచించారు. బాధ్యతాయుతం గా పోలింగ్ ప్రక్రియ నిర్వహించాలన్నారు. ఎలాం టి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమన్నారు. నివేదికలను త్వరిత గతిన అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్, తహసీల్దార్ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో బి.రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న 62 మంది

శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి విధులు నిర్వహించే ఉద్యోగ ఓటర్లు సోమవారం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారి కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశారు. మొత్తం 96 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోగా సోమవారం 62 మంది తమ ఓటు హక్కు వినియోగించుకు న్నారు. మంగళవారం వరకు అధికారులు అవకాశం కల్పించారు. కాగా ఈ కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షి షా సందర్శించి ఓటింగ్ తీరును పరిశీలించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు బహిష్కరిస్తాం..

- రోడ్డు నిర్మించాలని భీంపూర్ గ్రాడ్యుయేట్ జేఏసీ డిమాండ్
- సమస్య పరిష్కరించకుంటే మండలాన్ని మహారాష్ట్రలో కలపాలి

ఆదిలాబాద్‌టౌన్: దశాబ్ద కాలంగా ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యను పరిష్కరించకపోతే ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరిస్తామని భీంపూర్ మండల గ్రాడ్యుయేట్ జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఆదిలాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరు లతో మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ ప్రాంత రోడ్డు సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రతీ ఎన్నికల్లో నాయకులు హామీలు ఇస్తూ ఓట్లు దండుకుంటున్నారే తప్ప చిత్తశుద్ధి చూపడం లేద న్నారు. సమస్య పరిష్కరించకపోతే మండలాన్ని పక్కన ఉన్న మహారాష్ట్రలోనైనా కలపాలన్నారు. రానున్న రోజుల్లో దశల వారీగా ఉద్యమిస్తామ న్నారు. అలాగే మండలంలోని గ్రామాల్లో అధికారు లను తిరగనివ్వమని, తామే స్వయం పాలన చేసు కుంటామని స్పష్టం చేశారు. ఇందులో జేఏసీ నాయ కులు నరేశ్‌రెడ్డి, నితీష్, శైలేందర్ యాదవ్, లతీఫ్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

క్లుప్తంగా

రూ.18 లక్షలు సీజ్


నగదు చూపిస్తున్న ఏఎస్పీ రాజేశ్‌మీనా

సోన్(నిర్మల్): సరైన పత్రాలు లేని రూ.18 లక్షలు సీజ్ చేసినట్లు ఏఎస్పీ రాజేశ్‌మీనా తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నందిపేట మండలానికి చెందిన బొమ్మకంటి రాజేశ్వర్‌గౌడ్ నిర్మల్ నుంచి ఆర్మూర్‌వైపు కారులో వెళ్తుండగా గంజాల్ టోల్‌ప్లాజా వద్ద తనిఖీ చేయగా రూ.18 లక్షలు పట్టుకున్నట్లు తెలిపారు. సరైన పత్రాలు లేకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నగదును కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులకు అందజేసినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ నవీన్ కుమార్, ఎస్సై గోపి, హెడ్‌కానిస్టేబుల్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై తేనెటీగల దాడి

దిలావర్‌పూర్(నిర్మల్): మండలంలోని సాంగ్వి గ్రామానికి చెందిన వృద్ధురాలు లస్మబాయి సోమవారం వైద్యంకోసం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. మందులు తీసుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో ఆస్పత్రి ఆవరణలో చెట్టుపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో వృద్ధురాలు లబోదిబో మంటూ కొంత దూరం పరిగెత్తింది. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి


రాకేష్ (ఫైల్)

గుడిహత్నూర్(బోథ్): అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన బెక్కం రాకేష్ (29) వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. గత శుక్రవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం లింగాపూర్–గుడిహత్నూర్ వెళ్లే దారిలో సింధే రాజుకు చెందిన చేనులో కుళ్లిన స్థితిలో మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మొక్కజొన్న చేనుకు అమర్చిన సోలార్ విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడని, కంచె ఏర్పాటు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ భీమేష్, ఎస్సై మహేందర్ తెలిపారు.

కారును ఢీకొట్టిన లారీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవాపూర్ చెక్‌పోస్టు సమీపంలో కారును లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరికి స్వల్పగాయాలైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. హైదరాబాద్‌లోని అల్వాల్ ప్రాంతానికి చెందిన తరుణ్‌రాజ్ బాల్‌రాజ్ సోమవారం కారులో ఆదిలాబాద్‌కు వస్తుండగా దేవాపూర్ చెక్‌పోస్ట్ సమీపంలో వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న తరుణ్‌రాజ్ బాల్‌రాజ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆల్‌రౌండర్.. శశివంత్

- బ్యాట్ పడితే పరుగులు.. బాల్ పడితే వికెట్లు
- క్రికెటర్‌గా రాణిస్తున్న సింగరేణి ఉద్యోగి
- బాల్యం నుంచే క్రికెట్‌పై మక్కువ
- గల్లీ నుంచి కోలిండియా వరకు ప్రతిభ



సంగారెడ్డిలో జరిగిన పోటీల్లో క్రికెట్ కప్‌తో శశివంత్‌రెడ్డి

చెన్నూర్: బాల్యం నుంచి క్రికెట్‌పై మక్కువ పెంచుకున్నాడు. గల్లీల్లో ప్లాస్టిక్ బ్యాట్ పట్టుకుని రబ్బర్ బాల్‌తో బాల్య స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడాడు. 'ఇంతింతై వటుడింతై' అన్న చందంగా మండల స్థాయిలో క్రికెట్ పోటీల్లో ఆరంగేట్రం చేసిన శశివంత్‌రెడ్డి నేడు కోలిండియా పబ్లిక్ సెక్టార్ పోటీలకు ఎంపికై అందరి చేత శభాష్ అనిపించుకున్నాడు. సింగరేణి ఆధ్వర్యంలో గత నెల 6 నుంచి 9 వరకు నాగ్‌పూర్‌లో జరిగిన పోటీల్లో 40 పరుగులు సాధించి కోలిండియా పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 27 నుంచి డెహ్రాడూన్‌లో జరిగే కోలిండియా పోటీల్లో రాణించేందుకు వారం రోజులుగా కోల్‌కత్తా క్యాంప్‌లో ప్రాక్టీస్ చేస్తున్నాడు.

శశివంత్‌రెడ్డి ప్రస్థానం..

చెన్నూర్‌కు చెందిన చల్లా శశివంత్‌రెడ్డి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేశాడు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలలో పాఠశాల జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి విజయం సాధించేందుకు కృషి చేశాడు. చెన్నూర్‌లో నిర్వహించిన మండల, జిల్లాస్థాయి పోటీల్లో రాణించాడు. వరంగల్‌లో డిగ్రీ చేస్తుండగా కాకాతీయ యూనివర్శిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నాడు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జట్టుకు ఐదు సంవత్సరాలు సారథ్యం వహించాడు. పలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చాడు. 2020లో సింగరేణిలో వారసత్వ ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలలో పాల్గొనే జట్టుకు సారథ్యం వహిస్తున్నాడు.

వరుస విజయాలు

2016 నుంచి 2017 వరకు హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డిలో నిర్వహించిన పలు రాష్ట్ర స్థాయి పోటీలలో జట్టుకు సారథ్యం వహించి వరుస విజయాలు సాధించాడు. మోహినొద్దీన్ గోల్డ్ కప్, తెలంగాణ గోల్డ్ కప్ క్రికెట్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జట్టుకు సారథ్యం వహించిన శశివంత్‌రెడ్డి ఒంటిచేత్తో కప్‌లను కైవసం చేసుకున్నాడు. అనంతరం జాగృతి క్రికెట్ అసోసియేషన్‌ను ప్రారంభించి రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించారు.

క్రికెట్‌లో ప్రతిభ..

శశివంత్‌రెడ్డి బ్యాట్స్‌మెన్‌గా, బౌలర్‌గా రాణిస్తున్నా డు. బ్యాట్ పడితే పరుగుల వరద కురవాల్సిందే. బౌలింగ్ చేస్తే వికెట్లు పడాల్సిందే. జిల్లా, రాష్ట్రస్థా యి పోటీల్లో వ్యక్తిగత స్కోర్ 50 పరుగులకు పైగా చేయడమే కాకుండా మూడు నుంచి నాలుగు వికె ట్లు పడగొట్టి మ్యాన్ ఆఫ్‌ద మ్యాచ్ అందుకున్నాడు.

జట్టు విజయంపైనే దృష్టి

పోటీల్లో విజయం సాధించాలంటే సమష్టి కృషి అవసరం. ఏ పోటీల్లో వ్యక్తిగత ఆటపై దృష్టి సారించలేదు. జట్టు విజయంపైనే దృష్టి సారిస్తా. కోలిండియా పోటీల్లో గెలుపొందే అవకాశాలు ఉన్నాయి. జట్టుకు ఎంపికైన వారంతా వారం రోజులుగా ప్రాక్టీస్ చేస్తున్నాం. సమష్టిగా రాణిస్తే విజయం మా సొంతం అవుతుంది. – చల్లా శశివంత్ రెడ్డి, క్రికెట్ క్రీడాకారుడు, చెన్నూర్

రాష్ట్రస్థాయి పోటీల విజేత ఖమ్మం జట్టు


పోటీల్లో గెలుపొందిన ఖమ్మం జట్టు

బోథ్: మండలంలోని పట్నాపూర్‌లో రెండు రోజులుగా రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీల్లో 76 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్ పోటీల్లో ఖమ్మం, నిర్మల్ జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన పోరులో ఖమ్మం జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు మాజీ సర్పంచ్ పంద్రం సుగుణ రూ.25,111లతో పాటు మెమొంటో, ద్వితీయ స్థానంలో నిలిచిన నిర్మల్ జట్టుకు రూ.15,111, తృతీయస్థానంలో నిలిచిన నందిగామ జట్టుకు రూ.8,111 బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో చైతన్య యూత్ అధ్యక్షుడు తొడసం విజయ్ కుమార్, న్యాయవాది పంద్రం శంకర్, తొడసం భూమన్న, మడావి లాల్ దేవ్, జలపత్, పెందూర్ సోనేరావు, గోపాల్, సాయిదీపక్, వినీత్ కుమార్, జంగరాజ్, అనిల్, యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


ఓరగంటి అఖిల

నేరడిగొండ(బోథ్): మండల కేంద్రానికి చెందిన క్రీడాకారిణి ఓరగంటి అఖిల సీనియర్ సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్ తెలిపారు. ఈ నెల 2 నుంచి 3 వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మినీ స్టేడియంలో నిర్వహించిన 11వ సీనియర్ సాఫ్ట్‌బాల్ మహిళ, పురుషుల ఛాంపియన్ షిప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా తరపున ఆడి బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్రలోని అమరావతి నగరంలో ఈనెల 22 నుంచి 26 వరకు జరిగే 46వ సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలో ఆడనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా అసోసియేషన్ సభ్యులు గోడం జ్యోతిరామ్, పీడీ అఖిల్, నాగరాజ్, శ్యామ్, మోహన్, తిరుపతి, గౌతమ్ అభినందించారు.

'పది' పరీక్షలకు సన్నద్ధం చేయాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


ఆశ్రమ పాఠశాలలో మాట్లాడుతున్న పీవో

తాంసి(బోథ్): పదోతరగతి విద్యార్థులను వార్షిక పరీక్షల కోసం ప్రత్యేక ప్రణాళికతో సన్నద్ధం చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుశాతంతో పాటు పలు రికార్డులు తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా దృష్టి సారించాలన్నారు. ప్రత్యేక తరగతులతో పాటు స్టడీఅవర్స్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీవో వెంట వార్డెన్ హరీశ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై డి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు మండలం లోని రేకులగూడకు చెందిన చింతకుంట్ల పోశంకు నలుగురు కూతుర్లు, కుమారుడు సంతానం. పెద్ద కుమార్తె సంధ్య (22) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తోంది. అయితే ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. ఇదే సమస్యతో తీవ్ర మనోవేదనకు గురైన ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు రెబ్బెన పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తండ్రి పోషం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో మహారాష్ట్ర వాసి ఆత్మహత్య



సుదాం మృతదేహం

వాంకిడి(ఆసిఫాబాద్): మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా జివితి తాలుకా హెరెవా గ్రామానికి చెందిన హూడెబె సుదాం (33)కు భార్య సావిత్రిబాయితో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పత్తి తీత సమయంలో వాంకిడి మండల ప్రాంతంలోనే కుటుంబంతో కలిసి వచ్చి కూలీ పనులకు చేసుకునేవాడు. ఈక్రమంలో కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం భార్యతో కలిసి హీరాపూర్‌లో ఉన్న అత్తగారింటికి వెళ్లాడు. సోమవారం ద్విచక్ర వాహనంపై మండల కేంద్రానికి వచ్చాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న సుదాం ఫర్టిలైజర్ దుకాణంలో పురుగుల మందు కొనుగోలు చేశాడు. అర్లీ గ్రామ శివారులోని పత్తి చేనులోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని సోదరుడు హూడెబె సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో మహిళ..

కడెం(ఖానాపూర్): పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు కడెం మండలం గంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దేవునిగూడెంకు చెందిన పెంద్రం రాజేశ్వరి (50) ఈనెల 22న భర్త లింగుతో గొడవపడింది. దీంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో 23న ఆదివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి పందిరి సీతాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ సదస్సులో వయోవృద్ధులు


అవార్డు అందుకుంటున్న దేవిదాస్ దేశ్‌పాండే

ఆదిలాబాద్‌టౌన్: రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించిన సీనియర్ సిటిజన్ జాతీయ సదస్సుకు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వయోవృద్ధులు హాజరైనట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే తెలిపారు. సదస్సులో వయోవృద్ధుల సంరక్షణ, ఆరోగ్యం, 2007 చట్టంతో పాటు 70–90 ఏళ్లు దాటిన వారికి అందించే సేవలపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనకు రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రయ్య అవార్డు ప్రదానం చేసినట్లు వివరించారు. ఇందులో జిల్లాకు చెందిన వయోవృద్ధులు సత్యనారాయణ, రాం కులకర్ణి, శేషగిరిరావు, మధుకర్, ప్రేమ్‌రాజ్ గౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, శివప్రసాద్ ఉన్నారు.

అత్తపై గొడ్డలితో దాడి చేసిన అల్లుడు

గుడిహత్నూర్(బోథ్): మద్యం మత్తులో అత్తపై అల్లుడు గొడ్డలితో దాడి చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కమలాపూర్‌కు చెందిన నాగాడే శశికళ కూతురు రేణుకకు నార్నూర్ మండలంలోని మహాగావ్‌కు చెందిన బావ్‌నే వెంకటితో 2008లో వివాహమైంది. అప్పటి నుంచి వెంకటి మద్యం సేవించి తరచూ ఇంట్లో గొడవ చేస్తుండడంతో రేణుక కమలాపూర్‌లో ఉంటోంది. వెంకటి సైతం ఇక్కడే కూలీ పనులు చేసుకుంటూ ఉంటున్నాడు. ఇక్కడ సైతం తాగివచ్చి గొడవ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సైతం తాగి ఇంట్లో గొడవ పడుతుండగా శశికళ అడ్డుపడింది. దీంతో ఆగ్రహానికి గురైన వెంకటి పక్కనే ఉన్న గొడ్డలితో ఆమెపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై మహేందర్ సంఘటనా స్థలానికి చేరుకుని వెంకటిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'బీజేపీకి బుద్ధిచెప్పండి'

పాతమంచిర్యాల: సింగరేణి సంస్థకు చెందాల్సిన శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కార్పొరేట్‌లకు అప్పగించడానికి వేలం పాట వేసిన బీజేపీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల శ్రమను దోచుకునేందుకు బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసిందన్నారు.

- పత్తి విత్తనాల సరఫరా కాలమిదే
- అధికారులు నిఘా పెంచాల్సిందే

నిషేధిత విత్తనంపై జాగ్రత్త


నిషేధిత లూజ్ పత్తి విత్తనాలు (ఫైల్)

బెల్లంపల్లి: నిషేధిత గ్లైసిల్ (లూజ్‌సీడ్) విత్తనాల దందాకు సమయం ఆసన్నమైంది. ఈ సీజన్‌లోనే అక్రమార్కులు నకిలీ పత్తి విత్తనాలను దిగుమతి చేసుకుంటారు. వానాకాలం సీజన్ ఆరంభానికి మూడు, నాలుగు నెలల ముందు నుంచి (జనవరి, ఫిబ్రవరి) గ్లైసిల్ విత్తనాలను ఆంధ్రప్రదేశ్ నుంచి క్వింటాళ్ల కొద్దీ రవాణా చేసి రహస్య ప్రాంతాల్లో నిల్వ ఉంచి గుట్టుగా విక్రయాలు సాగించడం కొన్నేళ్లుగా జరుగుతోంది. ప్రస్తుతం గ్రామాల్లో పత్తి సేకరణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. అధికారులు నిఘా పెట్టక ముందే గ్లైసిల్ విత్తనాలను, గ్లైఫోసెట్ మందును దిగుమతి చేసుకోవడానికి అక్రమార్కులు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా నకిలీ విత్తనాలు చేరాల్సిన చోటుకు చేరిపోతాయి. దందా నిర్వహణలో పాత నేరస్తులు, అనుమానితుల కదలికలపై నిఘా పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. వ్యవసాయ, పోలీసుశాఖలు ఎన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నా ప్రత్యేకంగా ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినా దందాకు అడ్డుకట్ట పడడంలేదు.

నకిలీ విత్తనాల దందాకు నిలయాలు

జిల్లాలోని కొన్ని ప్రాంతాలను కేంద్రాలుగా చేసుకున్న అక్రమార్కులు నకిలీ విత్తనాల దందా నిర్వహిస్తున్నారు. ప్రధానంగా భీమిని, కన్నెపల్లి, తాండూర్, నెన్నెల, వేమనపల్లి, కాసిపేట, బెల్లంపల్లి, మందమర్రి, జైపూర్, భీమారం, చెన్నూర్, కోటపల్లి, తదితర ప్రాంతాల పేర్లు ప్రచారంలో ఉన్నాయి.

లూజ్ పత్తి విత్తనాలవైపు మొగ్గు

ఏటా సాగు చేస్తున్న పత్తి విత్తనాల్లో ప్రభుత్వ నిషేధిత లూజ్ పత్తి విత్తనాలదే సింహభాగం అనడంలో అతిశయోక్తి లేదు. రైతులు ఈ రకమైన పత్తి విత్తనాలను విత్తుకోవడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న విషయం తెలిసిందే. పత్తి సాగులో కలుపుతీత సమస్య, చీడపీడలు ఆశించి పంటకు నష్టం కలిగించడం, ఇతర రకాల పత్తి విత్తనాల ధర అధికంగా ఉండడం వంటి ప్రతికూల అంశాలు నిషేధిత పత్తి విత్తనాల వైపు రైతులు మొగ్గు చూపడానికి కారణమవుతున్నట్లు తెలుస్తోంది. అంతగా రైతులను ప్రభావితం చేస్తున్న గ్లైసిల్ పత్తి విత్తనాల సరఫరాకు ప్రస్తుత సీజన్ ఎంతో అనువైనది. సమయానుకూలంగా రైళ్లు, ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, లారీలు, వ్యాన్‌లు, ఒక్కోసారి కార్లలో రవాణా చేస్తుండడం జరుగుతోంది. ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టుల్లోనూ నకిలీ విత్తనాలు రవాణా చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ శాఖల అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకుని నకిలీ పత్తి విత్తనాల దందాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

అండదండలతోనే నకిలీ దందా!

నకిలీ పత్తి విత్తనాల దందాలో కొందరి వ్యవహా రం 'తిలాపాపం తలా పిడికెడు' అన్న చందంగా తయారైందనే విమర్శలు ఉన్నాయి. ఈ అక్రమ వ్యాపారంలో కొందరు వలస వాదులు, ఎరువులు, విత్తనాల వ్యాపారులు, అక్రమార్కులతో పా టు మరి కొందరు చోటామోటా రాజకీయ నాయకుల ప్రమేయం ఉన్నట్లు ప్రచారంలో ఉంది. వీరికి అక్కడక్కడ కొందరు అధికారులు సైతం లోపాయి కారిగా సహకరిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు.

నిఘా ఉంచాం..

నిషేధిత గ్లైసిల్ పత్తి విత్తనాలు అక్రమ రవాణా జరగకుండా నిఘా ఉంచాం. అనుమానిత వ్యక్తులు, పాత నేరస్తుల కదలికలపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నాం. గ్లైఫోసెట్ రవాణా చేసినా అమ్మకాలు సాగించినా ఊరుకునేది లేదు. గ్రామాల్లో ఎక్కడైనా నకిలీ విత్తనాలు, గ్లైఫోసెట్ విక్రయాలు సాగిస్తున్నట్లు తెలిస్తే వ్యవసాయ అధికారులకు సమాచారం అందించి సహకరించాలి. – కల్పన, జిల్లా వ్యవసాయాధికారి, మంచిర్యాల

'ఓట్లు అడిగే అర్హత కాంగ్రెస్‌కు లేదు'


మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేష్

నేరడిగొండ(బోథ్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఆ పార్టీ పూర్తిగా విఫలమైందని ఎంపీ గోడం నగేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ బలపర్చిన పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయుల అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపునకు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు, పట్టభద్రుల సమస్యలు పరిష్కారం కావాలంటే బీజేపీ బలపర్చిన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం, మాజీ జెడ్పీటీసీ గడ్డం భీంరెడ్డి, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చొక్కపెల్లి రాములు, నాయకులు ఆకుల రాజశేఖర్, సరసాని మహేందర్ రెడ్డి, జాదవ్ పరశురాం, గట్టు నారాయణ, తీగల నవీన్, కోటేశ్, కొప్పుల నవీన్, బాశ్రే శేఖర్, తోట విజయ్ పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థికసాయం


ఫిక్స్‌డ్ డిపాజిట్ అందిస్తున్న స్నేహితులు

రామకృష్ణాపూర్(చెన్నూర్): పట్టణంలోని ఆల్ఫోన్సా పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి భిల్లా వంశీ గతేడాది సెప్టెంబర్ 15న విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. 2002 బ్యాచ్‌కు చెందిన అతని స్నేహితులు తమవంతు బాధ్యతగా సాయం చేయాలని సంకల్పించారు. రూ.7లక్షలు సేకరించి పోస్టాఫీస్‌లో అతని పిల్లల పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కష్టసమయంలో స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు బాధ్యతగా ముందుకు వచ్చిన పూర్వ విద్యార్థులను స్థానికులు అభినందించారు.

పుస్తెలతాడు దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కరుణాకర్‌రావు

ఆదిలాబాద్‌టౌన్: మహిళ మెడలో నుంచి పుస్తెల తాడు అపహరించిన ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఇల్లెల్వార్ రమేశ్‌ను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. సోమవారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన చెట్లవార్ మౌనిక ఈనెల 22న శనివారం తన కుమార్తెను ఇంటికి తీసుకెళ్లేందుకు మధ్యాహ్న సమయంలో పాఠశాలకు వెళ్లింది. తాటిగూడలోని శిశు మందిర్ గేటు తీసేందుకు ప్రయత్నించగా ఆమెకు సహాయం చేస్తున్నట్లుగా నటించిన రమేశ్ ఆమె మెడలో నుంచి రెండు తులాల పుస్తెల తాడు లాక్కొని పరారయ్యాడు. సోమవారం నెహ్రూ చౌక్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితుడిని గుర్తించి అతని వద్ద నుంచి 54 గుండ్లు, రెండు పుస్తెలు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై విష్ణుప్రకాష్, పోలీసులు గోపాల్, ప్రవీణ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత


బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద తప్పిపోయిన బాలిక(3)ను మంచిర్యాల పోలీసులు ఆరుగంటల వ్యవధిలో తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ ప్రమోద్‌రావు తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అస్రెల్లి గ్రామానికి చెందిన జంగం సంగీత–నరేంద్రగుప్తా దంపతులకు కుమారుడు, కూతురు నయాన్సి మనోజ్ ఉన్నారు. కుమారుడి ఆరోగ్యం బాగాలేకపోవడంతో దంపతులు సోమవారం బెల్లంపల్లి చౌరస్తాలోని ఆస్పత్రికి తీసుకొచ్చారు. కుమారుడిని డాక్టర్ వద్దకు తీసుకెళ్లి వచ్చేలోగా బాలిక కనిపించకుండా పోయింది. మధ్యాహ్నం ఆస్పత్రిలైన్‌లో ఏడుస్తూ కనిపించడంతో పోలీసులు బాలికను బాలసదన్‌లో అప్పగించారు. అనంతరం సీసీ కెమెరాల ఆధారంగా బాలిక తల్లిదండ్రులను గుర్తించి సమాచారం అందించారు. పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అప్పగించారు.

సింగరేణి విస్తరణకు కృషి

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్



మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు ఇతర రంగాల్లో విస్తరించడానికి తమ యూనియన్ కృషి చేస్తుందని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బీ జనక్‌ప్రసాద్ తెలిపారు. సోమవారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ఇప్పటి వరకు బొగ్గు ఉత్పత్తిలో రాణిస్తుందని, ఇక సోలార్ మెటల్ మైనింగ్, ఇథనాల్ రంగాల్లో విస్తరించనుందన్నారు. ఈ మేరకు తమ యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పెద్దలను కలిసి సింగరేణి విస్తరణపై చర్చించి పలు సూచనలు సలహాలు చేశామన్నారు. సింగరేణిలో కార్మికుల సొంతింటి కల నెరవేర్చడానికి కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన నరేందర్‌రెడ్డికి ఓటేసి గెలిపించాలన్నారు. సమావేశంలో యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షుడు గరిగే స్వామి, ప్రధాన కార్యదర్శి ఏనుగు రవీందర్‌రెడ్డి, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతిరాజు, నాయకులు మహేందర్‌రెడ్డి, సదానందం, బొడ్డు ప్రభాకర్, భీమ్ రవి పాల్గొన్నారు.